క్లుప్తంగా

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



రాజుపాలెంలో ఏలేరు కాలువ గట్టుకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: భారీ వర్షాలు, ఏలేరు వరద కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని రాజుపాలెంలోని ఏలేరు వాలుకాలువ గట్టుకు పడిన గండి ప్రదేశాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది రైతులు ఏలేరు జలాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తారన్నారు. అతివృష్టి కారణంగా ఎగువ ప్రాంతం నుంచి వరద నీటితో మండలంలోని రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాల్లో ఏలేరు కాలువ గట్టుకు గండ్లు పడి వేలాది ఎకరాలు నీట మునిగాయన్నారు. తరచూ గండి పడుతున్న గట్ల వద్ద ప్రొటెక్షన్ వాల్ నిర్మించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో జోకా శ్రీను, గణేశుల లచ్చబాబు, చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, విశ్వనాథం చక్రరావు, ఇళ్ల అప్పారావు కాపు, బొడ్డేటి గణపతి, సంఘన వెంకటేశ్వరరావు, బిళ్లకుర్తి శివాజీ, శరకణం సంతోష్, అడబాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లిలో పొలంబడి



డ్రోన్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

గండేపల్లి: భవిష్యత్‌లో పంటల సాగులో డ్రోన్ టెక్నాలజీ ప్రధాన భూమిక పోషిస్తుందని వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ హరి పేర్కొన్నారు. మండల కేంద్రమైన గండేపల్లిలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారీ చాలా సులభమన్నారు. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో ఎక్కువ పొలానికి మందులు పిచికారీ చేయవచ్చన్నారు. రైతులకు సబ్సిడీపై డ్రోన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పోతుల మోహన్‌రావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, ఉప్పలపాటి గోపాలకృష్ణ, కంటిపూడి సూరిబాబు, జిల్లా వనరుల కేంద్ర ఏఓ సంజీవ్ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



ఎ.మల్లవరంలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

రౌతులపూడి: గర్భిణులు, బాలింతలు మంచి పోషకాహారం తీసుకోవాలని శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్ఎస్‌వీ పద్మావతి సూచించారు. మండలంలోని ఎ.మల్లవరం, బలరామపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం గర్భిణులు, బాలింతలకు పోషణ మహా కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవటం ద్వారా పుట్టే బిడ్డ, తల్లి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని విధిగా తీసుకోవాలన్నారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, గంట్లు వంటి చిరుధాన్యాలు, ఆకుకూరలను ఆహారంలో తీసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి జానకీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవేణి, అప్పలరాజు, పార్వతి, సుదాఅపర్ణ, రామలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



వేమవరంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

తొండంగి: మండలంలోని వేమవరంలో అక్రమంగా తరలిస్తున్న 178 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎస్సై జగన్మోహన్‌రావు గురువారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్రమంగా బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేసారు. 178 బస్తాల్లో అక్రమంగా తరలిస్తున్న 8859 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని యాదాలవారి ఊరుకు చెందిన వై.శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించగా రేఖవాని పాలెం పాయింట్‌కు తరలించారు.

నష్టం అంచనాపై కసరత్తు !



హెచ్.కొత్తూరులో నీటమునిగిన వరి పంటను చూపుతున్న రైతు



చామవరంలో వరదకు దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బుల్లిబాబు

- రెండు రోజుల్లో తేలనున్న పంటనష్టాలు
- నీటి మునిగిన 3425 హెక్టార్లలో వరి, పత్తి పంటలు
- జలాశయాల్లో నిలకడగా నీటి నిల్వలు

తుని రూరల్: నియోజకవర్గంలో వరద తగ్గుముఖం పట్టింది. రెండు రోజులుగా ఎండలు కాస్తుండడంతో పంట నష్టం తేల్చేందుకు అధికారులు రంగంలోకి దిగారు. వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటికే నీట మునిగిన పంటలను గుర్తించిన వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఇప్పుడు పంట నష్టం ఏ మేరకు వాటిల్లింది అనే విషయాన్ని నిర్ధారించేందుకు ఆయా సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేస్తున్నారు.

ఐదు మండలాల్లో...

తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 57 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో 6643 మంది రైతులకు చెందిన 3425 హెక్టార్లలో వరి, పత్తి పంటలు నీట మునిగినట్టు ప్రాథమికంగా గుర్తించిన విషయం తెలిసిందే. నీటమునిగిన పంటలు ఎంత వరకు దెబ్బతిన్నాయో గుర్తించేందుకు వీఆర్వో, వీపీఏలు క్షేత్రస్థాయిలో మరోసారి తనిఖీ చేస్తున్నారు. సబ్‌డివిజన్‌లో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 17 వేల హెక్టార్లు కాగా వర్షాలు కురిసే సమయానికి 15 వేల హెక్టార్లలో వరి, పత్తి, అపరాల పంటలను రైతులు వేశారు. వరద తాకిడితో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలకు నష్టం లేదని హార్టికల్చర్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. నీట మునిగిన పండ్ల తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా సాధారణ స్థాయికి వస్తాయని తెలిపారు.

క్రస్ట్ గేట్లు ఎత్తడంతోనే...

మెట్ట ప్రాంతమైన తుని సబ్ డివిజన్‌లో భారీ వర్షాలకు ఆరుతడి పంటలకు స్వల్పంగానే నష్టం వాటిల్లింది. ప్రాజెక్టుల రక్షణ దృష్ట్యా పంపా, తాండవ రిజర్వాయర్ల క్రస్ట్ గేట్లు ఎత్తి అదనపు జలాలను దిగువకు విడుదల చేయడం, పుష్కర, పీబీసీ కాలువల వరదలతో తొండంగి, రౌతులపూడి, కోటనందూరు, శంఖవరం, తుని మండలాల్లో పంటలు నీటమునిగాయి. ప్రస్తుతం నిలకడగా పంపా రిజర్వాయర్‌లో 98.56 అడుగులు, తాండవలో 378.08 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి.

ఖరీఫ్ సీజన్‌లో సాగు, వర్షాలకు నీట మునిగిన పంటల వివరాలు

మండలం	గ్రామాల సంఖ్య	సాగు చేసిన విస్తీర్ణం (హెక్టార్లలో)	నీట మునిగిన విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతుల సంఖ్య
తుని	14	2880	421	747
తొండంగి	19	4936	2161	4027
కోటనందూరు	8	3907	227	324
రౌతులపూడి	10	2443	569	1447
శంఖవరం	6	835	47	98
మొత్తం	57	15,001	3425	6643

అత్యధిక వర్షపాతం నమోదు

కాకినాడ జిల్లాలోని ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తుని సబ్‌డివిజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో 21 మండలాలు ఉండగా ఐదు మండలాల్లో సాధారణం కంటే అత్యధికంగా వర్షపాతం నమోదైంది. వీటిలో నాలుగు మండలాలు తుని సబ్‌డివిజన్‌లోనే ఉన్నాయి. కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో అత్యధికంగానూ, తుని మండలంలో అధికంగానూ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో కోటనందూరు మండలంలో సరాసరి వర్షపాతం రికార్డు స్థాయిలో నమోదైంది.

ఖరీఫ్ సీజన్‌లో మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

మండలం	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం
తుని	569.6	841.3
తొండంగి	563.7	941.7
కోటనందూరు	391.2	1118.3
రౌతులపూడి	557.4	893.4
శంఖవరం	557.4	901.3

14 నుంచి అభ్యంతరాల స్వీకరణ

వరదలకు నష్టం వాటిల్లిన పంటల నమోదు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. బాధితుల జాబితాలను ఈ నెల 14న గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తాం. జాబితాలు పరిశీలించుకున్న రైతులు అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఈ నెల 17వ తేదీలోగా తెలియజేయాలి. గ్రామాల్లో వీపీఏలు, మండలాల్లో ఏఓలు అందుబాటులో ఉంటారు.

–బుల్లిబాబు, ఏడీఏ, తుని

మంచి చేతిరాతను అలవర్చుకోవాలి

గండేపల్లి: విద్యార్థులు, ఉపాధ్యాయులు మంచి చేతిరాత (హ్యాండ్ రైటింగ్)ను అలవరుచుకోవాలని డీఆర్పీ బి.అబ్రహంహాన్స్ సూచించారు. గండేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు మంచి హ్యాండ్ రైటింగ్‌పై నేర్పించడం అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతిరాత బాగుంటే తలరాత బాగుంటుందన్న సామెత ఉందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మంచి చేతి రాతను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కేహెచ్ నాయక్, పాఠశాల స్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం

తుని రూరల్: మండలంలోని డి.పోలవరంలో శుక్రవారం ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి గురువారం తెలిపారు. పతాంజలి ఫుడ్స్ నర్సరీలో ఉదయం పది గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే యనమల దివ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. పెద్ద మొత్తంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆమె తెలిపారు.

నేడు మండల అత్యవసర సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.పద్మజ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశంలో తుపాను కారణంగా నష్టపోయిన రైతులు, పంటల వివరాలపై చర్చిస్తామన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

నేటి నుంచి వేద-2కే24 టెక్ ఫెస్ట్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శుక్రవారం నుంచి వేద-2కే24 టెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్టు వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని జాతీయ స్థాయిలో 13, 14 తేదీల్లో నిర్వహించే టెక్ ఫెస్ట్ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు, నూతన ఆవిష్కరణలను విజ్ఞాన ప్రపంచానికి పరిచయం చేసే ఈ ఫెస్ట్ వేదికగా నిలుస్తుందన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు నగదు, జ్ఞాపిక, ప్రశంస పత్రాలు అందజేస్తామని చెప్పారు.

సీతారాం ఏచూరి మృతి బాధాకరం

ప్రత్తిపాడు రూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆకాల మరణం బాధాకరమని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కోడి శ్రీనివాస్ అన్నారు. సీతారాం ఏచూరి మృతికి గురువారం ఆయన సంతాపం తెలిపారు. దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి పాత్ర ఎంతో కీలకమన్నారు. అటువంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

జగ్గంపేట: పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని కాట్రావులపల్లి శివారులో పేకాడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.42 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సారాతో మహిళ అరెస్టు

గోకవరం: సారా విక్రయిస్తున్న మహిళను గోకవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. హెచ్‌సీ అబ్బులుదొర తెలిపిన వివరాల ప్రకారం .. రంపయర్రంపాలెం శివారున సారా అమ్మకాలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశారు. సారా విక్రయిస్తున్న చాకలి మంగను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు హెచ్‌సీ అబ్బులుదొర తెలిపారు.

తెగిన గట్లు.. పంట రక్షణకు పాట్లు



రాజుపాలెంలో తెగిపోయిన కాలువ గట్లను పూడ్చుకుంటున్న రైతులు

కిర్లంపూడి: ఏలేరు ప్రాజెక్టులో అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో మండలంలోని పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. కాలువ గట్లు తెగిపోయి వందలాది ఎకరాల్లో పంటలు నీట మునియాయి. వేలాది రూపాయిలు ఖర్చు పెట్టి పండించిన పంట కళ్ల ఎదుటే నీటిపాలు అవుతుంటే చేసేది ఏమీ లేక రైతులు దీనస్థితిలో ఉండిపోయారు. రామకృష్ణాపురంలోని ఏలేరు కాలువ గట్టుకు గండి పడడంతో కిర్లంపూడి రాజుపాలెం మధ్యలో పంట కాలువల గట్లు తెగిపోయాయి. గురువారం వరద నీరు తగ్గుముఖం పట్టినప్పటికీ పంట కాలువలు నుంచి వచ్చే నీరు నేరుగా వరి పొలాల్లోకి పోతోంది. దీంతో రైతులంతా కలిసి తెగిపోయిన కాలువ గట్లను పూడ్చుకోవడంలో నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లో చెరువులుగా మారిన పంట పొలాలను చూసి రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

కోతకు గురైన ఏటి గట్ల పరిశీలన

గండేపల్లి: భారీ వర్షాలు, వరదల ధాటికి మండలంలోని పలు గ్రామాల్లో పంట, ఏలేరు కాలువ గట్లకు గండ్లు పడ్డాయి. ఇర్రిపాకలో గండ్లు పడిన, కోతకు గురైన ఏటి గట్లను గురువారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు, ఇరిగేషన్ ఏఈ శ్రీను, ఇతర అధికారులు పరిశీలించారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక నుంచి కిర్లంపూడి మండలం ముక్కొల్లు వరకూ ముంపు గ్రామాల్లో ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టి రానున్న రోజుల్లో ఏలేరు వరదను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అనంతరం తిరుమాలి రెగ్యులేటర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



తిరుమాలిలో రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఆర్డీఓ సీతారామారావు

శానిటరీ మెటీరియల్ అందజేత



దానవాయిపేట పంచాయతీకి శానిటరీ మెటీరియల్‌ను అందజేసిన దివీస్ ప్రతినిధులు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి, దానవాయిపేట పంచాయతీల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు దివీస్ ల్యాబోరేటరీస్ సంస్థ ప్రతినిధులు శానిటరీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. దివీస్ సీఎస్ఆర్ నిధులతో చేపట్టే స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రూ.లక్ష విలువైన బ్లీచింగ్, సున్నం, పినాయిల్‌ను దానవాయిపేట సర్పంచ్ మడదా తిరుమల కుమారి, పరమేశ్వరరావు, ఒంటిమామిడి సర్పంచ్ అంగుళూరి సుధాకర్ సమక్షంలో పంచాయతీ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు ఎస్.బాలకృష్ణ, కె.తేజ, పంచాయతీ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



ఎస్.తిమ్మాపురంలో వరద బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న మహిళా సమాఖ్య సిబ్బంది

కిర్లంపూడి: మండలంలోని రాజుపాలెంలో వరద బాధితులకు గురువారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, ఎంపీపీ తోట రవి, గంధం ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గొడె దొరబాబు, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, చదరం చంటిబాబు, గణేశుల లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహారం పంపిణీ

కిర్లంపూడి: మండలంలోని వరద బాధితులకు మహిళా సమాఖ్య సిబ్బంది ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ డీఆర్డీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీరమణి ఆదేశాలతో గురువారం రాజుపాలెం, ముక్కొల్లు, వీరవరం, భూపాలపట్నం, శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం గ్రామాల్లో సుమారు 3 వేల మంది వరద బాధితులకు ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడాల సంధ్యారాణి, పెట్ల ఎస్తేర్‌రాణి, బుద్ద పార్వతి, సంధ్య, అఖిల్, సీసీ లోవరాజు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు రూ.2 లక్షల విలువైన వస్త్రాలు



విజయవాడకు వస్త్రాలతో వెళుతున్న వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న రమణమూర్తి

అన్నవరం: విజయవాడలో వరద బాధితులకు అన్నవరానికి చెందిన సత్యగాయత్రీ బ్రాహ్మణ సంఘం, సత్యదేవ సేవా సంస్థ రూ.2 లక్షలు విలువైన వస్త్రాలను సమకూర్చింది. విజయవాడకు వస్త్రాలు తరలించే వ్యాన్‌కు గురువారం సంఘం అధ్యక్షుడు రమణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యదేవ సేవా సంస్థ అధ్యక్షుడు రేపాక వీర్రాజు, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు కన్నబాబు, గాడేపల్లి నానీ, మంధా రాంబాబు, కామర్సు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



బొద్దవరంలో సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు స్థానిక ఎస్సై టి.రామకృష్ణ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..బొద్దవరం గ్రామం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో దాడి చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, గ్రావెల్ తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి



ఏవీ నగరం పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు

తొండంగి: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, అధికారులు దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ భాస్కరరావు సూచించారు. ఏవీ నగరం పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి పి.రవికుమార్, వైద్యురాలు పి.భారతి ఇతర సిబ్బందితో సమీక్షించారు. ఆస్పత్రిలో రోగుల వివరాలు, ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి ఆస్పత్రి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు, వరదల నేపథ్యంలో గ్రామాల్లో వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అప్రమత్తంగా ఉండి వ్యాధుల ప్రబలకుండా నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు రూ.20 వేల విరాళం

సామర్లకోట: స్కూలు అభివృద్ధి కోసం స్థానిక బ్రౌన్‌పేటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు మాగాపు ఆనందశాస్త్రి గురువారం రూ.20 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తంతో హైస్కూల్‌లోని విద్యుత్ వైరింగ్ పనులు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనకు హెచ్‌ఎం మీనా మాధురి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పాలిక చంటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం



కనకదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం 'మూల' సందర్భంగా గురువారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమం గుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు కంచిభట్ల సాయిరామ్, సంతోష్ ఘనపాఠి, గంగాధరబట్ల శర్మ, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

నేడు వనదుర్గ అమ్మవారికి చండీహోమం

రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు చండీహోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆసక్తి గల భక్తులు రూ.750తో టిక్కెట్ కొనుగోలు చేసి హోమంలో పాల్గొనవచ్చన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

తుని: కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే..సుమారు 50 సంవత్సరాల మహిళ ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ వచ్చి రైళ్లలో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. గత నెల 30న తుని-గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి తీవ్ర గాయపాలైంది. 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.